కథా నిలయం
1503
శ్రీకాకుళం

# జనం

*"ఇంక వీడి పనై పోయింది"*

*అన్నాడు మా ఆనందం రేడియో వింటూ.*

*రేడియో వాడి పనై పోయిందని కాదు వాడి ఉద్దేశ్యం.*

మా ఇంటి ఎదురుగా వున్న చెయిర్మన్ గారి పార్టీ ఎన్నికల్లో రాష్ట్ర వ్యాపితంగా తుడిచిపెట్టుకుపోయింది. ఆ సంతోషం పట్టలేక వాడు అలా అన్నాడు, రాత్రి పదకొండు గంటలకి రేడియోలో ఎన్నికల వార్తలు వింటూ, కిటికీలోంచి బయటకు చూస్తూ.

కురుస్తున్న వెన్నెల్లో ఎదురుగా వున్న చెయిర్మన్‌గారి మేడ తెల్లగా మెరుస్తోంది. మేడపైన ఓడిపోయిన అధికార పార్టీ పంచరంగుల జండా ఇంకా ఏడుపుమొహంతో వేళ్లాడుతూనే వుంది.

మేడలోమాత్రం ఒక దీపంకూడా వెలగడం లేదు. అలికిడి ఏవీ లేక అర్ధరాత్రివేళ శ్మశానంలా వుంది.

చెయిర్మన్ మేడకి ఆ పేరు ఎందుకు వచ్చిందో తెలియదు. ఆ మేడలో ఉండే ఆయన ఎన్నడూ చెయిర్మన్ చేసింది లేదు. ఏ పదవీ నిర్వహించినదీ లేదు. ఆయన కింగ్ కాదు కాని, కింగ్ మేకర్.

చెయిర్మన్‌గారి మేడంటే చిన్నమేడ కాదు. విశాలమైన కోటలా ఉంటుంది. సాధారణంగా ఎప్పుడూ వచ్చీ పోయే కార్లతో నిండి ఉండే విశాలమైన ఆవరణలో ఒక్క కారుకూడా లేదు. సినిమా స్కోపు స్క్రీనంతటి గేటు - తాళం వేసి వుంది. గూర్కా కూడా గేటు పక్కన తనకు ప్రత్యేకంగా కట్టిన గదిలో నిశ్శబ్దంగా కూర్చున్నాడేమో.... వాడి అలికిడి కూడా లేదు.

"ఆ తోటలో ప్రతీ ఇటికరాయి ప్రజలదే. వాడి సొమ్మనేది ఏవీ లేదు. అందుచేత అది చెయిర్మన్‌గాడి మేడకాదు - ప్రజాభవనం అనాలి" అంటాడు మా ఆనందం.

ఆనందమే కాదు - పదేళ్ల క్రితం చెయిర్మన్ గారిని ఎరిగిన

వాళ్లందరూ అనే మాట అది.

పదేళ్లక్రితం తినడానికి తిండికూడా లేకుండా, 'అంటిపళ్లండి' 'అంటిపళ్లండి' అంటూ వీధులమ్మట అమ్ముకుంటూ తిరుగుతూ ఉండేవాడు, ఈ రోజున దేశానికి మొగుడై కోటలో పాగా వేశాడంటే అది ఆయన జాతకమో, తెలివితేటలో, పొదుపరితనమో, మరేవిటో ఆ దేవుడికే తెలియాలి.

చెయిర్మన్‌గారిని అందరూ 'మా వూరి రావణాసురుడు' అని ముద్దుగా పిలుస్తారు. కారణం 'ఇది' అని స్పష్టంగా తెలియదు కాని, ఎక్కడ ఏ గుటాలం జరిగినా 'చెయిర్మనుగాడి హేండుందని' అంటారు. ఇటువంటి ప్రచారం వలన చెయిర్మన్‌గారన్నా, అలాంటి వాళ్లని మేపుతున్న, అలాంటి వారు పోషిస్తున్న పంచరంగుల పార్టీ అన్నా జనాల్లో కసి విపరీతంగా పెరిగిపోయింది.

అందుచేత ఈసారి ఎన్నికల్లో ఏడు రంగుల ఇంద్రధనుస్సు పార్టీ నెగ్గింది. పంచవన్నెల పార్టీ ఓడిపోవడమే కాదు - వీధికో బకాసురుణ్ణి పెంచి పోషించిన ఆ పార్టీని జనాలు చీపురుతో తుడిచేసి పెంటకుప్ప మీదకు విసిరేశారు.

మరునాడు బ్రహ్మాండమైన ఊరేగింపు లేవదీశారు ఇంద్రధనుస్సు పార్టీవారు.

ఆ వూరేగింపు బయలుదేరినప్పుడు ప్రత్యేకమైన గమ్యం ఏదీ లేదు. అలా జనాలు పూరికెనే ఆనందం వెల్లడిచేస్తూ రోడ్లమీద పడ్డారు కాని, మెల్లి మెల్లిగా అందరి మనస్సుల్లోనూ ఒకే ఆలోచన చోటు చేసుకుంది.

గుంపులో ఎక్కడ ఎలా మొదలవుతుందో తెలియదు కాని, ఏదో భావం చోటు చేసుకుని గుంపంతా వ్యాపించి పోతుంది. ఇక ఆ గుంపంతా ఒక మనిషిగా మరో ఆలోచన లేకుండా నడుస్తుంది.

పంచరంగుల పార్టీ దొంగల పార్టీ.

పంచరంగుల పార్టీ నాయకుడు చెయిర్మన్.

చెయిర్మన్ దొంగల నాయకుడు.

ఈ రోజు దొంగల నాయకుడి పని పట్టాలి.

ఇలా స్పష్టంగా, అంచెలంచెలుగా గుంపు ఆలోచించలేదు కాని,

క్రమంగా అందరిలోనూ అదే ఆలోచన చోటుచేసుకుంది.

ఆ ఆలోచన రావడంతో వూరు వూరంతా కదిలి వచ్చేసింది. దాదాపు పదివేలమంది చెయిర్మన్‌గారి మేడ ముందుకు చేరారు. ఈ జనవాహినిని చూసి గూర్కా గేటుకి తాళం వేసి లోపలకు పారిపోయాడు.

పోలీసులకి కబురందిందో లేదో, లేక ఏ రంగు జండాకి ఆ రంగు గొడుగు పట్టడం మంచిదనో వాళ్లూ రంగంలో దిగలేదు.

జనాల ఉద్రేకం క్షణ క్షణానికి పెరిగిపోతూంది. గేటు దూకి, గోడలు దూకి లోపలకు ప్రవేశించారు నినాదాలు చేస్తూ.

"చెయిర్మన్ డౌన్! డౌన్!"

ఇన్నేళ్లుగా తాము అనుభవించిన కష్టాలకీ, అవమానాలకీ, దారిద్ర్యానికీ, అసంతృప్తికీ, బాధలకీ ఆ క్షణంలో వాళ్లకు కనుపించిన కారణం ఎదురుగా ఉన్న చెయిర్మన్‌గారి మేడే. ఆ మేడమీదే వాళ్ల ఆగ్రహం కేంద్రీకరించబడింది.

మేడ ముందున్న రోడ్డుమీద రోడ్డు వేయడానికి పోసిన కంకరరాళ్ల గుట్టలోంచి ఒక రాయి ఎగిరి చెర్మన్‌గారి మేడ కిటికీ అద్దాన్ని ఫెళ్లున పగలగొట్టింది. మరుక్షణం గుంపంతా రాళ్లగుట్టమీద పడింది. కంకర రాళ్లన్నీ రోడ్డుమీంచి మాయమై ఆకాశంలోకి ఎగిరి అక్కడినుండి మేడమీద వడగళ్లలా కురిశాయి ఒక పది నిమిషాలు.

ఇంద్రధనుస్సు పార్టీవారు ఎవరైనా అంతకు ముందు నాయకత్వంలో ఉన్నా, ఈ పరిస్థితి వచ్చేటప్పటికి తప్పించుకు వెళ్లిపోయారు. వారు పదవుల కోసం ఓట్ల పోరాటం చేసే శాంతిప్రియులే కాని దుష్టశిక్షణకు, శిష్ట రక్షణకు కంకణం కట్టుకున్నవారుమాత్రం కాదు.

ఇప్పుడు అది నాయకుడు లేని గుంపు. ఎప్పుడు ఎటు వెడుతుందో ఏం చేస్తుందో తెలియని మూక.

"జనం వ్యవహారం చూస్తే శృతి మించి రాగాన పడుతున్నట్టుంది. మనం లోపలకు పోదాం పద" అన్నాను ఆనందంతో.

"కంగారు పడక చూస్తూ వుండు"

రాళ్ల దెబ్బలకి తెల్లటి మేడ నల్లగా కమిలిపోయింది. తలుపులు, కిటికీ అద్దాలు, ఆవరణలో ఉన్న దీపస్తంభాల మీది వింత వింత బల్బులు అన్నీ తునాతునకలై పోయాయి. కోటమీది పంచవన్నెల జండా చిరిగిపోయి

పీలికలు గాలిలో మెల్లగా ఎగురుతున్నాయి.

"చెయిర్మన్ బయటకు రావాలి."

"చెయిర్మన్ డవున్! డవున్!"

అలా కేకలు మిన్నుముట్టుతున్న సమయంలో ఆ కోటమీద ఎగురుతున్న పంచవన్నెల జండా మెల్లిగా కిందికి దిగ నారంభించింది.

జనాలింకా ఆశ్చర్యం నుంచి కోలుకోకముందే మెల్లిగా కిందనుండి ఏడురంగుల సిల్కు జండా పయ్యారంగా పైకి లేచింది. జండా కొయ్య చివరకి చేరి నిలవనంటున్న జవరాలి పవిటలా జారి గాలిలో రెపరెపలాడింది.

జనమంతా గొల్లున గోలచేసి, ఈల వేసి, కేక లేసి డాన్సుచేస్తుండగా ఆ జండా కింద ఏడు రంగుల టోపీ పెట్టుకుని, ఏడు రంగుల కండువా వేసుకుని నిలబడి ఉన్న చెయిర్మన్‌గారు వాళ్లకు రెండుచేతులు కలిపి నమస్కరించారు.

ఒక్క క్షణం నిశ్శబ్దం తరువాత ఉప్పెన విరుచుకుపడింది.

"చెయిర్మన్‌గారికి జై,"

"ఇంద్రధనుస్సు పార్టీకీ జై!"

జనం ఏకకంఠంతో నినాదాలిచ్చుకుంటూ, చిందులు తొక్కుతూ చెయిర్మన్‌గారి మేడలోంచి బయటకు నడిచారు.

ఆ రోజంతా రోడ్లమీద తిరుగుతూనే వున్నారు అలా అరుస్తూ.

*['ఆంధ్రప్రభ' సచిత్రవారపత్రిక, 2-5-84, సౌజన్యంతో...]*

❄ ❄ ❄